సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 15 । జూలై । 2025



సింగిల్ డిజిట్ బడులు 81

పాఠశాలల పునః ప్రారంభానికి ముందే బడి బాట నిర్వహించినా.. జిల్లాలోని 81 పాఠశాలల్లో 10 మంది లోపే విద్యార్థులున్నారు. 8లో



సాగర్ ఆయకట్టుకు జలకళ

శ్రీశైలం నుంచి సాగర్‌లోకి నీరు చేరడంతో సాగు అవసరాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు వదిలారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉత్తమ అవార్డు దరఖాస్తులకు గడువు పెంపు

కొత్తగూడెంఅర్బన్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు దరఖాస్తుల గడువు ఈనెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరా చారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జెడ్పీ, ప్రభుత్వ, ఏఈఈఎస్, ఏకలవ్య పాఠశాలల్లో పని చేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని, అప్‌లోడ్ చేసిన వివరాల ధృవపత్రాలను అదే రోజు విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: దివ్యాంగుల ఆర్థిక ప్రోత్సాహక పథకం కింద జిల్లాలోని దివ్యాంగులకు స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు అవసరమైన రుణాలు ఇస్తామని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 100 శాతం రాయితీతో రూ.50 వేల చొప్పున 27 యూనిట్లు, 80 శాతం రాయితీతో రూ.లక్ష యూనిట్ ఒకటి, 60 శాతంతో రూ.3 లక్షల యూనిట్ ఒకటి ఇస్తామని పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 63019 81960 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైద్యులకు సన్మానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్యులు ఇటీవల ఓ మహిళకు ల్యాప్రోస్కోపిక్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. దీంతో ఐటీడీఏ పీఓ బి.రాహుల్ వైద్యులను సోమవారం అభినందించడంతో పాటు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఉండడంతో రూ.2 లక్షలు ఖర్చయ్యే శస్త్రచికిత్సను వైద్యశాల సూపరింటెండెంట్ రామకృష్ణ రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా తొలిసారి ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో శస్త్రచికిత్స నిర్వహించారని, మారుమూల ఆదివాసీ గ్రామాల ప్రజలు సరైన అవగాహన లేక ఇలాంటి వ్యాధులతో ఇబ్బందులు పడుతుంటారని, వైద్య సిబ్బంది వారిని గుర్తించి వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య, ఏరియా ఆస్పత్రి సూపరిటెండెంట్ రామకృష్ణ, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ వెంకటరాజ్, డాక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ధర ముందడుగు..



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధరలో స్వల్పంగా ఎదుగుదల నమోదైంది. కొంతకాలంగా ధరలతో పోలిస్తే ప్రస్తుతం రూ.350 నుంచి రూ.500 మేర పెరుగుదల కనిపిస్తోంది. ఫిబ్రవరిలో మిర్చి క్వింటాకు రూ.14 వేల నుంచి రూ.14,500 వరకు పలికిన ధర మార్చి ఆరంభం నుంచి రూ.14 వేల లోపుకు పడిపోయింది. మార్చి, ఏప్రిల్‌లో రూ.13,500 నుంచి రూ.13,850 మధ్యే పలకగా మే నెలలోనైతే రూ.13 వేలు దాటలేదు. జూన్ ఆరంభంలో ఏసీ మిర్చికి రూ.14,200 వరకు ధర వచ్చినా ఆతర్వాత రూ.13 వేలకు పడిపోవడంతో ఈ నెలారంభం నుంచి పురోగతి కనిపించింది. ఈనెల మొదటి వారంలో ఏసీ మిర్చి(తేజా రకం) ధర రూ.13,350 నుంచి పెరుగుతూ 11వ తేదీకి రూ.13,500కు చేరింది. ఇక సోమవారం మరో రూ.350 పెరిగి రూ.13,850కు చేరడం విశేషం. నాన్ ఏసీ మిర్చి విషయానికొస్తే జూన్‌లో రూ.12,500 లోపే ధర పలకగా, ఈనెలారంభం నుంచి పుంజుకుంటూ సోమవారం రూ.13,600కు చేరింది.

నాడు గండ్లు.. నేడు లీకులు



ప్రధాన కాల్వ గైడ్‌వాల్ నుంచి లీకవుతున్న నీరు



'సీతారామ'లో మొదలైన గోదావరి జలాల ఎత్తిపోతలు

- లిఫ్ట్ చేసిన రెండో రోజే ప్రధాన కాల్వ నుంచి లీకేజీలు
- తొలిసారి ఎత్తిపోసినప్పుడు మెయిన్ కెనాల్‌కు గండ్లు
- నిర్మాణ పనుల్లో నాణ్యతపై సందేహాలు ?

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ ప్రాజెక్టులో 1 నుంచి 8 ప్యాకేజీల్లో భాగంగా రూ.6,714 కోట్ల వ్యయంతో 104.4 కి.మీ. పొడవైన ప్రధాన కాల్వ నిర్మించారు. దీని నీటి ప్రవాహ సామర్థ్యం 9వేల క్యూసెక్కులు. ఈ కాల్వ పొడవునా కిన్నెరసాని, ముర్రేడు వంటి నదులు, వాగులతో పాటు చిన్నచిన్న ఒర్రెల వంటి నీటి ప్రవాహాలు ఎదురైన చోట అక్విడెక్ట్‌లు, గైడ్‌వాల్లు, సూపర్ ప్యాసేజీలు నిర్మించారు. 2018లో పనులు ప్రారంభించగా 2022 చివరి నాటికి మూడు పంప్‌హౌస్‌లు, ప్రధాన కాల్వల నిర్మాణం పూర్తయింది. గతేడాది ఆగస్టు, ఈ ఏడాది మార్చిలో రెండు సార్లు గోదావరి నీరు ఈ కాల్వ ద్వారా ప్రవహించింది. మూడో విడతగా ఇటీవల నీటిని ఎత్తిపోశారు. అయితే గోదావరి నుంచి కృష్ణా ఆయకట్టుకు నీటిని తరలించే క్రమంలో ముర్రేడు వాగుపై నిర్మించిన అక్విడెక్ట్ (నీటి ప్రవాహాలు వెళ్లేందుకు నిర్మించే వంతెన)కు పలు చోట్ల లీకేజీలు బయటపడ్డాయి. అలాగే అక్విడెక్ట్ ముందు భాగంలోని గైడ్‌వాళ్ల నుంచి కూడా నీరు లీకవుతోంది. గత శనివారం మధ్యాహ్నం అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద గల పంప్‌హౌస్ నుంచి ఒక మోటారు ద్వారా ఎత్తిపోతలు ప్రారంభించారు. ఇక్కడి నుంచి రెండు, మూడు పంప్‌హౌస్‌లకు నీటి ప్రవాహ క్రమంలో ఆదివారం రాత్రి నుంచి ప్రధాన కాల్వలో లీకేజీలు బయటపడుతున్నాయి. దీంతో గైడ్‌వాల్ పక్కన గల అప్రోచ్ రోడ్ బురదమయంగా మారుతోంది.

ముందే బయటపడిన గండ్లు..

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన పంప్‌హౌస్‌ల ద్వారా గత ఖరీఫ్ సీజన్‌లో తొలిసారి నీళ్లు ఎత్తిపోశారు. అయితే ఈ కార్యక్రమానికి ముందే మొదటి రెండు పంప్‌హౌస్‌ల మధ్య ప్రధాన కాల్వకు రెండు, మూడు చోట్ల గండి పడిన విషయం వెలుగుచూసింది. గతేడాది ఆగస్టు 15న మోటార్లు ఆన్ చేసి తొలిసారిగా నీరు ఎత్తిపోయగా.. రెండు వారాలు గడవకముందే మెయిన్ కెనాల్‌కు పాల్వంచ, చంద్రుగొండ మండలాల్లో రెండు చోట్ల గండ్లు పడ్డాయి. భారీ వర్షాలకు వరద నీరు ప్రధాన కాలువలో పెరిగిపోవడంతో నీటి ఒత్తిడి పెరిగి గండ్లు పడ్డాయని ఇంజనీర్లు వివరణ ఇచ్చారు. దీంతో ప్రధాన కాల్వపై వరద నీటి ఒత్తిడి తగ్గించేందుకు రూ.60 కోట్లతో ఎస్కేప్ చానల్ నిర్మించాలని నిర్ణయించారు. ప్రధాన కాల్వకు వరుసగా పడుతున్న గండ్లు, కుంగిపోతున్న కాంక్రీట్ నిర్మాణాలు, లీకులకు నిలయంగా మారిన గైడ్‌వాళ్లు 'సీతారామ' పనుల నాణ్యతపై సందేహాలకు తావిస్తున్నాయి.

కుంగిన సూపర్ ప్యాసేజ్..



ప్రధాన కాల్వపై కుంగిన సూపర్ ప్యాసేజీ పియర్(ఫైల్)

రబీ సీజన్‌లో కృష్ణా ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు ఈ ఏడాది మార్చిలో నీటిని ఎత్తిపోశారు. ఆ తర్వాత కొద్ది రోజులకే ములకలపల్లి మండలం వీకే రామవరం గ్రామ సమీపంలో ప్రధాన కాల్వ వెంట 48.30 కి.మీ. దగ్గర సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించిన సూపర్ ప్యాసేజ్ పిల్లర్ (పియర్) కూలిపోయింది. ఈ ప్యాసేజ్ కింద నాలుగు పిల్లర్లు ఉండగా ఒకటి కూలిపోవడంతో కాలువ రివిట్‌మెంట్ కూడా దెబ్బతిన్నది. ఇక ఈ సీజన్‌లో వర్షాలు మొదలైన తర్వాత ఈనెల 10న ములకపల్లి మండల పరిధిలో ప్రధాన కాల్వ మట్టికట్ట కోతకు గురైంది. దీనిపై దృష్టి సారిస్తుండగానే తాజాగా గైడ్‌వాల్ లీకేజీలు వెలుగు చూశాయి.

లీకేజీలు గుర్తిస్తున్నాం

ప్రధాన కాల్వకు ఎన్ని చోట్ల లీకేజీలు ఉన్నాయనేది దాన్ని గుర్తిస్తున్నాం. ప్రస్తుతం జరుగుతున్న ఎత్తిపోతల పని పూర్తి కాగానే లీకేజీలు ఉన్న చోట మరమ్మతులు చేపడతాం. ప్రధాన కాల్వ నిర్మాణ పనులు (గైడ్‌వాల్స్, అక్విడెక్ట్‌లు) చేపట్టిన సంస్థనే లీకేజీలకు మరమ్మతులు చేయాల్సి ఉంటుంది.

– శ్రీనివాసరెడ్డి, సీతారామ ప్రాజెక్ట్ ఎస్‌ఈ

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణి దృష్టికి ప్రజలు తీసుకొచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించి, పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ప్యూన్‌బస్తీలో అంబేద్కర్ విగ్రహానికి, ట్రాన్స్‌ఫార్మర్‌కు మధ్య గల ప్రభుత్వ స్థలంలో గణేష్ విగ్రహం ఏర్పాటు పేరుతో ఓ మాజీ కౌన్సిలర్ ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయగా కమిషనర్‌కు ఎండార్స్ చేశారు. ఇంకా బినామీ పేర్లతో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్, ఎస్సీ, ఎస్టీ సంఘాల వారు ఫిర్యాదు చేయగా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు.

■ తాగునీటి సమస్య తీర్చాలి..



ప్రజావాణికి వచ్చిన పాలవాగు గ్రామస్తులు

'మా గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేసి విద్య అందించాలి.. బోరింగ్ నుంచి వస్తున్న బురదనీరు తాగి రోగాల బారిన పడుతున్నాం.. మంచినీటి సౌకర్యం కల్పించాలని ఏడాది కాలంగా తిరుగుతున్నా ఫలితం లేదు' అంటూ చుంచుపల్లి మండలం పాలవాగు గ్రామ గిరిజనులు వాపోయారు. గ్రామానికి చెందిన చోడి లక్ష్మణ్, మడివి రాజు, సోడె భూమయ్య, సోడె మల్లేష్, మడివి రాజు, మన్నెం వెంకటయ్య, మన్నె వెంకటేశ్వర్లు సహా 30 మంది సోమవారం ప్రజావాణికి హాజరై కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. పిల్లలను బడిలో చేర్పించాలంటే కిలోమీటర్ల దూరంలోని పెనగడప, ములుగుగూడెం వెళ్లాలని, వర్షం వస్తే మధ్యలో వాగు పొంగి రాకపోకలు ఉండవని తెలిపారు. సత్వరమే సమస్యలు పరిష్కరించాలని కోరారు.

■ భూసమస్య పరిష్కారం కావడం లేదు



భూసమస్యపై దరఖాస్తు చేసిన గౌరారపు సీతమ్మ, దమ్మక్క

భూసమస్యపై ప్రజావాణిలో పలుమార్లు దరఖాస్తు చేసినా పరిష్కారం కావడం లేదని దుమ్ముగూడెం మండలం లక్ష్మీనరసింహారావుపేటకు చెందిన దివ్యాంగ వృద్ధురాలు గౌరారపు సీతమ్మ, గౌరారపు దమ్మక్క ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సర్వే నంబర్ 5/1లో 3.10 సెంట్ల భూమిలో 2.10 సెంట్ల భూమి గౌరారపు సమ్మయ్య అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. ఈ విషయమై అనేక సార్లు దరఖాస్తు చేసినా పరిష్కారం కాలేదని, ఈ భూమి సీతమ్మసాగర్ ప్రాజెక్టులో పోగా నష్ట పరిహారం చెక్కు రూ.18 లక్షలు ఆక్రమణదారుడి పేరుతో ఇచ్చారని, గతేడాది ఆగస్టులో డబ్బులు కూడా డ్రా చేసుకున్నాడని తెలిపారు. గ్రామంలో విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని అదనపు కలెక్టర్‌ను కోరారు.

17న ఇల్లెందుకు మంత్రి సీతక్క

ఇల్లెందురూరల్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఈనెల 17న ఇల్లెందులో పర్యటించనున్నారు. మండలంలోని రొంపేడులో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటుతారు. అనంతరం ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ యార్డులో నియోజవకర్గ స్థాయి మహిళా శక్తి పథకాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి పథకం అమలు, లబ్ధిదారులకు కలుగుతున్న ప్రయోజనాలపై చర్చిస్తారు. వడ్డీలేని రుణాలు రూ.5.06 కోట్లు, బ్యాంకు లింకేజీ కింద మంజూరైన రూ.30 కోట్లు, ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.15లక్షల చెక్కులను మహిళా సంఘాల సభ్యులకు అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లా, మండల స్థాయి అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

మేకపాలు శ్రేష్ఠం

కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెంఅర్బన్/సూపర్‌బజార్(కొత్తగూడెం): గేదెల పాల కంటే మేకపాలు ఎంతో శ్రేష్ఠమైనవని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెంలోని ఫుడ్ కోర్టులోని మహిళా శక్తి క్యాంటిన్ ఇటీవల ఆయన మేకపాల కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. కాగా, ఆ కేంద్రాన్ని సోమవారం సందర్శించిన కలెక్టర్.. మహిళలు అందించిన మేకపాలు తాగారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో గేదె, ఆవు పాల ధర లీటర్‌కు రూ. 80 వరకు ఉందని, మేకపాలు కూడా అదే ధరకు విక్రయించొచ్చని అన్నారు. జిల్లాలో రెండు లక్షల మేకలు ఉన్నాయని, రైతులు వాటి పాల విక్రయం ద్వారా నెలకు రూ.3 నుంచి రూ.4వేల వరకు ఆదాయం గడించవచ్చన్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు తప్పనిసరిగా మేకపాలు తాగించాలని తల్లిదండ్రులను కోరారు. నగరాల్లో మేకపాలతో పన్నీరు, చీజ్ వంటివి తయారు చేసి ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని, జిల్లా రైతులు కూడా దీనిపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు, డాక్టర్లు ఆనందరావు, బాలకృష్ణ, రామకృష్ణ, సంతోష్, గోపాలమిత్ర సత్యనారాయణతదితరులు పాల్గొన్నారు.



మేకపాలు తాగుతూ క్యాంటిన్ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

బయోచార్ తయారీ పరిశీలన..

చుంచుపల్లి: మండలంలోని విద్యానగర్ గ్రామపంచాయతీ డంపింగ్ యార్డ్‌లో మట్టి, ఇటుకలతో నిర్మించిన కోన్‌టిక్ కొలిమిలో ఎండిన సర్కారు తుమ్మ చెట్ల కొమ్మలను కాల్చి బయోచార్(జీవ బొగ్గు) తయారీ విధానాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ బయోచార్‌ను గోమూత్రం, గోవు పేడలో కొన్ని రోజులు నిల్వ చేసి, ఆరిన తర్వాత పొడిచేసి పంటలకు సేంద్రియ ఎరువుగా వాడితే భూసారం అభివృద్ధి చెందుతుందని, అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. పంచాయతీ సిబ్బంది, కార్మికులు గృహాలు, షాపుల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుభాషిని, డీఎల్పీఓ ప్రభాకర్ రావు, ఎంపీఓ సత్యనారాయణ, సిబ్బంది రాజు, రాజేశ్వరి, మమత, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

'సంక్షేమం'తో ఆర్థికాభివృద్ధి సాధించాలి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన దర్బార్‌లో గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. ఆయ దరఖాస్తులను యూనిట్ అధికారులకు అందించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ములకలపల్లి మండలం రామవరం, మూకమామిడి గ్రామస్తులు పోడు భూముల సర్వే, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల యూనిఫామ్ తయారీకి అనుమతి ఇవ్వాలని వినతులు సమర్పించారు. లక్ష్మీదేవిపల్లి మండలం ఆళ్లగండి గ్రామానికి చెందిన శివాని బీటీ రోడ్డు నిర్మించాలని, గుండాల మండలం పాలగూడెం గ్రామానికి చెందిన సాత్విక ఈఎంఆర్ఎస్ పాఠశాలలో ఏడో తరగతిలో సీటు ఇప్పించాలని, కామేపల్లి మండలం తొగ్గూడెం గ్రామానికి చెందిన భీమ్ చంద్ సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని, దుమ్ముగూడెం మండలం బండ్లగూడ గ్రామానికి చెందిన ముదిరాజు ఆశ్రమ పాఠశాలల్లో వంట మనిషిగా పనిచేసే అవకాశం కల్పించాలని అర్జీలు ఇచ్చారు. వాటిని ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి విడతల వారీగా అర్హులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని పీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ఏఓ సున్నం రాంబాబు, ఎస్ఓ భాస్కర్‌రావు, ఉద్యానవనాధికారి ఉదయ్‌కుమార్, కొండరెడ్ల అధికారి రాజారావు, ఆర్ఓఎఫ్ఆర్ డీటీ లక్ష్మీనారాయణ, ఏపీఓ(పవర్) వేణు, ఐడీసీఎస్ సూపర్‌వైజర్ అనసూయ, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

కొరవడుతున్న పర్యవేక్షణ



కొత్తగూడెంలో ఈఓ పోస్టు ఖాళీగా ఉన్న విఘ్నేశ్వరస్వామి ఆలయం

- ఉమ్మడి జిల్లాలో 600 పైగా ఆలయాలు
- ఏడాదికి రూ. 2లక్షలకు పైగా ఆదాయం వచ్చేవి 92..
- ఈ దేవస్థానాల్లో 18 ఈఓ పోస్టులు.. ఉన్నది 11 మందే
- ఇన్‌చార్జ్‌లతో భక్తులకు తప్పని ఇక్కట్లు

పాల్వంచరూరల్ : దేవాలయాల్లో భక్తుల సౌకర్యాలు, ఆలయ ఆస్తుల పరిరక్షణ, సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ చేయాల్సిన ఈఓ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలోని అనేక ఆలయాల్లో ఈ సమస్య వేధిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కలిపి మొత్తం 600 ఆలయాలు ఉండగా, ఇందులో ఏడాదికి రూ.2లక్షలు, ఆపైన ఆదాయం వచ్చే ఆలయాలు 92 ఉన్నాయి. ఈ దేవాలయాలకు సంబంధించి 18 ఈఓ పోస్టులు కేటాయించారు. అంటే ఒక్కో ఈఓ సుమారు ఐదు ఆలయాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ ఈ 18లో కూడా ప్రస్తుతం 11 మంది మాత్రమే విధుల్లో ఉండగా ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఉన్నవారిపై అదనపు భారం పడడమే కాక భక్తులకు కనీస సౌకర్యాలు అందడం లేదు.

పెద్ద ఆలయాలకూ దిక్కు లేదు..

ఉమ్మడి జిల్లాలో నిత్యం భక్తుల రద్దీ ఉండే పలు ఆలయాలకు కూడా రెగ్యులర్ ఈఓలు లేరు. జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తగూడెంలోని విజయ విఘ్నేశ్వరస్వామి, పాల్వంచలోని పెద్దమ్మతల్లి, భద్రాచలంలోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో ఇన్‌చార్జ్ ఈఓలే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక ఖమ్మం జిల్లాలో జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి, ఖమ్మం కమాన్‌బజార్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఖమ్మం రూరల్ మండలంలోని మారెమ్మగుడి వంటి పెద్ద ఆలయాలకు కూడా రెగ్యులర్ ఈఓలు లేరు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 11 మంది ఈఓలు ఉండగా, వారికి కేటాయించిన ఆలయాలతో పాటు ఆదాయం తక్కువగా ఉన్న ఇతర దేవాలయాల పర్యవేక్షణ బాధ్యతలు కూడా వీరిపైనే పడుతున్నాయి.


ఒకరు.. 17 ఆయాలు..

పలువురు ఈఓలు ఎక్కువ సంఖ్యలో ఆలయాలకు ఇన్‌చార్జ్‌లుగా ఉండడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. కొత్తగూడెంలోని దాసాంజనేయస్వామి ఆలయ ఈఓ శేషయ్య 17 దేవస్థానాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇందులో జిల్లాలో ఏడు ఆలయాలు ఉండగా ఖమ్మం జిల్లాలో పది ఉన్నాయి. పెద్దమ్మగుడి ఆలయ ఈఓ రజినీకుమారి ఇక్కడే ఇన్‌చార్జ్‌గా ఉండగా, ఈ దేవస్థానంతో పాటు పాల్వంచలోని భజన మందిరం, పాత పాల్వంచలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తగూడెంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం, ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని నీలాద్రీశ్వరస్వామి ఆలయాల బాధ్యతలు కూడా చూస్తున్నారు. ఖమ్మంలోని ప్రసిద్ధ శ్రీ స్తంభాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు జమలాపురం, జీళ్లచెరువులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు మారెమ్మగుడికి కూడా ఇన్‌చార్జ్ ఈఓగా వ్యవహరిస్తున్నారు. ఇలా ఒకటికి మించి ఆలయాల పర్యవేక్షణ బాధ్యతలతో వారు ఎక్కడా పూర్తిస్థాయిలో పని చేయలేకపోతున్నారు. దీంతో ఆలయాల్లో కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఉమ్మడి జిల్లాకు కేటాయించిన 18 పోస్టుల్లో ఖాళీగా ఉన్న ఏడు భర్తీ చేయడంతో పాటు అధిక ఆదాయం ఉన్న ఆలయాలకు ప్రత్యేకంగా ఈఓలను నియమించాలని భక్తులు కోరుతున్నారు.

అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములు..

ఉమ్మడి జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలో మొత్తం 14,771 ఎకరాల భూములు ఉన్నాయని రికార్డులు చెబుతున్నాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో 4,865 ఎకరాలు ఉండగా 862 ఎకరాలు అన్యాక్రాంతమైంది. భద్రాద్రి జిల్లాలో 9,906 ఎకరాలకు గాను 1,039 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. వాటిని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా.. ఆయా ఆలయాలకు ప్రత్యేకంగా ఈఓలు లేకపోవడంతో సరైన పర్యవేక్షణ ఉండడం లేదు.

పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు



ఉమ్మడి జిల్లాలో 600 ఆలయాలు ఉండగా ధూప, దీప నైవేద్యం పథకంలో 462 దేవాలయాలు ఉన్నాయి. ఇందులో ఏడాదికి రూ.2లక్షలకు పైగా ఆదాయం ఉన్న ఆలయాలు 92 ఉండగా మొత్తం 18 ఈఓ పోస్టులున్నాయి. ఇందులో ఏడు పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఇందుకోసం దేవాదాయ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించాం. ఏడుగురిని నియమించగానే ఆయా ఆలయాలకు కేటాయిస్తాం.

– వీరస్వామి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్

చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): చట్ట సభల్లో మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య పెరగాలని 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' రాష్ట్ర కన్వీనర్ కె.పరిణితి అన్నారు. స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల 50వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన స్వర్ణోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలపై అందరికీ అవగాహన ఉండాలని అన్నారు. విద్యార్థులు సేవా దృక్పథంతో రాజకీయ రంగంలో అడుగు పెట్టాలని, అవినీతిని నిర్మూలిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం వన్ నేషన్ – వన్ ఎలక్షన్‌పై అవగాహన కల్పించారు. మరో అతిథి కె.శివాజీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి విద్యార్థిని ఓటు హక్కు నమోదు చేసుకోవడంతో పాటు ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కరస్పాండెంట్ కె.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఒకే దేశం ఒకే ఎన్నిక పట్ల అందరూ అవగాహన పెంచుకోవాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద మాట్లాడుతూ నోటుకు ఓటు వేయకుండా సరైన నాయకుడిని ఎన్నుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. కార్యక్రమ నిర్వహణ కార్యదర్శి బి.మేఘన తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భద్రాద్రి అడిషనల్ డీఎంహెచ్ఓగా సైదులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సైదులుకు ఉద్యోగోన్నతి లభించింది. ఆయనను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓగా నియమిస్తూ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ బి.రవీంద్రనాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ సైదులు ఖమ్మం జిల్లాలో సుదీర్ఘకాలం వివిధ విభాగాల ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయన పదోన్నతి పొందిన సందర్భంగా అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దమ్మపేట: మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామ శివారు వ్యవసాయ క్షేత్రంలో సోమవారం పోలీసులు దాడి చేసి నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారయ్యారు. నిందితుల నుంచి మూడు బైక్‌లు, రూ.1,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్ బస్తీలో పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడిచేశారు. ము గ్గురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేయగా, మరో ఏడుగురు పారిపోయారు. రూ.4వేలు నగదు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అరెస్టయినవారిలో స్టేషన్ బస్తీకి చెందిన చలపల్లి ఉపేందర్, జరుపుల రఘువర్మ, కొత్తగూడేనికి చెందిన గుగులోతు రమేష్ ఉన్నారు.

6.64 క్వింటాళ్ల గంజాయి దహనం



గంజాయి దహనం చేయిస్తున్న అధికారులు

తల్లాడ: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న 6.64 క్వింటాళ్ల గంజాయిని సోమవారం తల్లాడ మండలం గోపాలపేటలో ఏడబ్ల్యూఎం బర్నింగ్ ప్లాంట్‌లో దహనం చేయించారు. ఖమ్మం జిల్లాలో పట్టుబడిన 1.82 క్వింటాళ్లు, భద్రాద్రి జిల్లాలో 4.82 క్వింటాళ్ల గంజాయి ఇందులో ఉందని అధికారులు తెలిపారు.

భూవివాదంలో ఘర్షణ

ఇల్లెందురూరల్: మండలంలోని బోయితండాకు సోదరులు వాంకుడోత్ రాములు, శ్రీకాంత్‌ల మధ్య సోమవారం పొలం వద్ద వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో డోర్నకల్ మండలానికి చెందిన శ్రీకాంత్ తరఫు బంధువులు భావ్‌సింగ్, మధు జోక్యం చేసుకుని రాములును తీవ్రంగా కొట్టారు. గాయపడిన రాములును స్థానికులు ఇలెందు ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొమరారం ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు.

బైక్, కారు ఢీ : ఇద్దరికి గాయాలు

పాల్వంచరూరల్: బైక్‌ను కారు ఢీకొనడంతో దంపతులకు గాయాలైన సంఘటన రంగాపురం బ్రిడ్జివద్ద సోమవారం చోటుచేసుకుంది. పాల్వంచ పట్టణంలోని కాంట్రాక్టర్స్ కాలనీకి చెందిన సత్యనారాయణ, సత్యావతి బైక్‌పై మణుగూరు నుంచి పాల్వంచకు వస్తున్నారు. ఈక్రమంలో రంగాపురంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద కారు ఢీకొనడంతో గాయపడ్డారు. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు.

ప్రెజర్ బాంబు పేలి ముగ్గురికి గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజ్‌బాంబు పేలి ముగ్గురు గిరిజనులు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలోని బందేపార – దన్నాల్ గ్రామాల మధ్య గల అడవుల్లో పుట్టగొడుగల సేకరణకు సోమవారం ఉదయం ముగ్గురు గిరిజనులు వెళ్లారు. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబును గమనించకుండా పుట్టగొడుగులు తీస్తుండడంతో ప్రెజర్‌బాంబు పేలి ముగ్గురికీ గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గ్రామస్తులు వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ముగ్గురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు.

వేధింపుల కేసు నమోదు

ఇల్లెందు: భార్యను వేధిస్తున్న భర్తపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వేములవాడ గ్రామానికి చెందిన బెస్త అనితకు కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన ప్రణీత్‌తో 2019లో వివాహమైంది. మద్యానికి బానిసైన ప్రణీత్ కొంతకాలంగా భార్యను వేధించడంతోపాటు తరచూ కొడుతున్నాడు. భర్త నుంచి తనకు రక్షణ కల్పించాలని బాధితురాలు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

సింగిల్ డిజిట్ బడులు 81



ఐదుగురు విద్యార్థులతో కొనసాగుతున్న నిజాంపేట ప్రాథమిక పాఠశాల

- ఆ పాఠశాలల్లో 9 మంది లోపే విద్యార్థులు
- మరో 12 పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు
- ఆయా గ్రామాల్లో ఫలితమివ్వని బడిబాట

ఇల్లెందు: ఇల్లెందు మండలం రేపల్లెవాడ గ్రామపంచాయతీ నిజాంపేటలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు విద్యార్థులే ఉన్నారు. ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే బడిబాట నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఆ గ్రామం నుంచి ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న నలుగురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చేందుకు తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేయడంలేదు. దీంతో ఐదుతరగతులను ఐదుగురు విద్యార్థులతో నడిపిస్తున్నారు. ఇల్లా జిల్లావ్యాప్తంగా సింగిల్ డిజిట్ విద్యార్థులు ఉన్న పాఠశాలలు 81 వరకు ఉన్నాయి. ఇవన్నీ కొనసాగుతాయో లేక మూతబడుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

ఒక్క అడ్మిషన్ కూడా పెరగలే..

గత నెల జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కాగా, అంతకుముందే బడిబాట నిర్వహించారు. కానీ జిల్లా వ్యాప్తంగా సింగిల్ డిజిట్ పాఠశాలలో కొత్త అడ్మిషన్ ఒక్కటీ కూడా పెరగలేదు. జిల్లా వ్యాప్తంగా ఎంపీపీఎస్, యూపీఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు 1,067 ఉండగా, వీటిలో 50,303 మంది విద్యార్థులు ఉన్నారు. వీటిల్లో తొమ్మిది మందిలోపు విద్యార్థులు ఉన్నపాఠశాలలు 81, అసలు విద్యార్థులు లేని పాఠశాలలు 12 ఉన్నాయి. కాగా, విద్యార్థులు పల్లె నుంచి పట్టణం వైపు పరుగులు తీస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఇక 40మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఉండాలని నిబంధనలు చెబుతున్నా, చాలా 40 మంది పిల్లలు లేని పాఠశాలల్లో ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు ఉన్నారు.

బడిబాట ఫలితాలేవి..?

ఏటా పాఠశాలలు పునఃప్రారంభానికి ముందు బడిబాట కార్యక్రమం నిర్వహించటం ఆనవాయితీగా మారింది. ఈ కార్యక్రమంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంతో కొంత పెరిగింది. కానీ సింగిల్ డిజిట్ పాఠశాలలల్లో మాత్రం విద్యార్థుల సంఖ్య పెరగలేదు. అన్నపురెడ్డిపల్లిలో గుంపెన, కట్టుగూడెం, అశ్వారావుపేటలో గరిబొడ్డు, భద్రాచలంలో ఏఎంసీ కాలనీ, దేవనగర్, దమ్మపేట మండలంలో మంగాపురం, లక్ష్మీదేవిపల్లి మండలంలో గొల్లగూడెం(బీ), పాత బంగారు చెల్క, పాల్వంచ మండలంలో భోజ్యాతండా, నారాయణపేట, సుజాతనగర్ మండలంలో లక్యాతండా పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేరు.

మా ప్రయత్నం చేశాం..

నిజాంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. ఈ గ్రామం నుంచి నలుగురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు వెళుతున్నారు. బడిబాట ద్వారా ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించాం. తల్లిదండ్రులను వ్యక్తిగతంగా కలిసి కోరినా వారు ససేమిరా అనటంతో వదిలేశాం. – సంపత్, ఉపాధ్యాయుడు, నిజాంపేట ఎంపీపీఎస్, ఇల్లెందు మండలం

సదుపాయాలు మెరుగుపర్చాలి

ప్రభుత్వ స్కూళ్లలో సదుపాయాలు మెరుగుపర్చాలి. ప్రతీ తరగతికి క్లాస్ రూం, ప్రతీ సబ్జెక్టుకు ఒక టీచర్, క్రాఫ్ట్, ఆర్ట్, మ్యూజిక్ టీచర్లు, పీఈటీ, ఆట స్థలం, ప్రయోగశాల, గ్రంథాలయం, కంప్యూటర్ గది, బాత్‌రూంలు, మరుగు దొడ్లు, తాగునీరు, అటెండర్, స్వీపర్, స్కావెంజర్, డిజిటల్ బోర్డులు ఉండాలి. అప్పుడు విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. – కబ్బాకుల రవి, ఏటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

పాఠశాలలను కొనసాగిస్తాం

ఒకరిద్దరు విద్యార్థులు ఉన్నా పాఠశాలలను నడిపిస్తాం. అసలు విద్యార్థులు లేని పాఠశాలల ఉపాధ్యాయులను సమీప పాఠశాలల్లో సర్దుబాటు చేశాం. ఉపాధ్యాయులు ఆసక్తిగా బడిబాట నిర్వహించిన చోట అడ్మిషన్ల సంఖ్య పెరిగింది. కొన్నిచోట్ల పెరగలేదు. పిల్లలను సర్కారు బడికి పంపేందుకు తల్లిదండ్రులు కూడా విముఖత చూపుతున్నారు. – వెంకటేశ్వరాచారి, డీఈఓ

సాగర్ ఆయకట్టుకు జలకళ



కృష్ణా జలాలకు చీర, సారె సమర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

పాలేరు రిజర్వాయర్ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటి విడుదల

- దశల వారీగా పూర్తిస్థాయిలో విడుదలకు ప్రణాళిక
- ఆయకట్టు పరిధిలో 2.54 లక్షల ఎకరాల సాగుకు భరోసా
- ఎడమకాల్వ వద్ద స్విచాన్ చేసిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కృష్ణా జలాలు సాగర్ కాలువల్లో బిరబిరా పరుగులెడుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగుపై సందిగ్ధత నెలకొన్న వేళ సాగర్ జలాలు రావడంతో సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌లోకి నీరు చేరడంతో సాగు అవసరాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి సోమవారం వెయ్యి క్యూసెక్కుల నీటిని వదిలారు. రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో నీటిని విడుదలకు కార్యాచరణ రూపొందించారు. ఏటా జులై చివరి వారం, ఆగస్టు మొదటి వారంలో విడుదల చేసే సాగర్ జలాలను ఈసారి వర్షాభావ పరిస్థితుల నేపథ్యాన ముందస్తుగా వదలడంతో ఆయకట్టు పరిధిలోని 2.54 లక్షల ఎకరాల ఆయకట్టులో సాగు కష్టాలు తీరనున్నాయి.

నిన్నటి దాక వెలవెల

ఖమ్మం జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిలుస్తుండగా, పాలేరు రిజర్వాయర్ నీరు లేక వెలవెలబోయింది. రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 23 అడుగులు కాగా.. ఈనెల మొదట్లో 12.45 అడుగులకు పడిపోయింది. దీంతో అటు సాగు, ఇటు తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయి. జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధిలోని 2.54 లక్షల ఎకరాల సాగుపై సందిగ్ధత నెలకొంది.

తాగునీటి అవసరాలకు..

పాలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గడంతో తాగునీటికి ఇబ్బంది ఎదురవుతుందని భావిస్తుండగానే కృష్ణా పరీవాహకంలో భారీ వర్షాలతో శ్రీశైలం, నాగార్జునసాగర్‌ప్రాజెక్టులో నీరు చేరింది. ఈక్రమాన సాగర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌లోకి నీరు విడుదల చేయడంతో రిజర్వాయర్ 20 అడుగులకు చేరింది. ఈ నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలని భావించినా, రైతుల అవస్థల దృష్ట్యా సాగు కోసం కూడా విడుదల చేయాలని నిర్ణయించారు. ఇక ఏటా మాదిరిగా సాగు అవసరాలకు ఈనెల 20నుంచి సాగర్ జలాలు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీంతో పాలేరు రిజర్వాయర్‌లో 20 అడుగులుగా ఉన్న నీటిని దిగువకు విడుదల చేస్తున్నా.. మరోమారు సాగర్ నుంచి వచ్చే నీటితో రిజర్వాయర్ నిండుతుందని భావిస్తున్నారు.

పంటల సాగుకు సిద్ధం..

సాగుపై సందిగ్ధంగా ఉన్న సమయాన సాగర్ జలాల విడుదల కావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు దుక్కులు దున్ని, వరి నారు సిద్ధం చేసుకున్న రైతులు ఇప్పుడు ధైర్యంగా నాట్లు వేయనున్నారు. జిల్లాలో సాగర్ ఆయకట్టు కింద 2,54,270 ఎకరాల భూమి ఉండగా, ఈ నీటితోనే పాలేరు, వైరా రిజర్వాయర్లు, పలు చెరువులు నింపాల్సి ఉంటుంది.

స్విచాన్ చేసి రెండో జోన్‌కు..

పాలేరు రిజర్వాయర్ వద్ద రెండో జోన్‌కు సాగునీటిని సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విడుదల చేశారు. తొలుత వెయ్యి క్యూసెక్కుల నీరు దిగువకు వదలగా.. డిప్యూటీ సీఎం, మంత్రి పూజలు చేసి కృష్ణా జలాలకు చీర, సారె సమర్పించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, ఆర్డీఓ నర్సింహారావు, ఇరిగేషన్ ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రవికుమార్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాఫీగా నీటి ప్రవాహం

కూసుమంచి: సాగర్ ఎడమ కాల్వకు మత్స్య పరిశోధన కేంద్రం వద్ద యూటీ గత ఏడాది వరదలతో కొట్టుకుపోగా పునర్నిర్మించారు. ఈ పనులు చివరి దశకు చేరగా నిర్మాణ ప్రాంతం వద్ద కాల్వలో నీరు సాఫీగా ప్రవహించేలా అధికారులు ఇరువైపులా మట్టి కట్టలు వేయించారు. కాల్వకు డిప్యూటీ సీఎం, మంత్రి నీరు విడుదల చేశాక యూటీ వద్ద సాఫీగా ప్రవహించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వరినాట్లు వేసుకుంటాం..




మాకు పెద్ద కాల్వ కింద మూడు ఎకరాల భూమి ఉంది. ఇన్నాళ్లు నీళ్ల పరిస్థితి తెలియక నాట్లు వేయడానికి ఆలోచించా. కానీ ముందుగానే సాగర్ నీళ్లు వదలడంతో వరి నాట్లు వేస్తాం. ముందుగా నీళ్లు వదలడం రైతులకు ఎంతో మంచిది. – జవ్వాజి పవన్‌కుమార్, మల్లాయిగూడెం

తాలిపేరు నుంచి సాగునీటి విడుదల



తాలిపేరు ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు



గోదావరి జలాలకు పూజలు నిర్వహిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా పంట చేలకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం సాగునీటిని విడుదల చేశారు. తొలుత అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగునీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రధాన కాలువలకు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లకు ఏర్పడిన గండ్లను త్వరితగతిన పూడ్చాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్ట్ నిర్వహణ పట్ల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పరుచూరి రవి కుమార్, భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తెల్లం సీతమ్మ, ప్రాజెక్టు డీఈ తిరుపతి, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఈదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీమకుర్తి వీరభద్రం, చీమలమర్రి మురళీకృష్ణ, మేడిచర్ల వీరకుమార్, ఏఈలు పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు..

జూలూరుపాడు: సీతారామ మెయిన్ కెనాల్ నుంచి గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు విడుదల చేశారు. సోమవారం వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ గేట్ల లాకులు ఎత్తి ఏన్కూర్ రాజీవ్ లింక్ కెనాల్‌లోకి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జూలూరుపాడు, ఏన్కూర్ మండలాల్లో 35 వేలు ఎకరాలు, వైరా రిజర్వాయర్‌కు నీటి తరలించడం వల్ల 25వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఈ ఎస్ శ్రీనివాసరెడ్డి, ఈఈ బి.అర్జున్, డీఈ చంద్రశేఖర్, ఏఈ సాగర్, సీఐ ఇంద్రసేనా రెడ్డి, ఎస్‌ఐ బాదావత్ రవి, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, లేళ్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

హత్యకేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

గుణదల(విజయవాడ తూర్పు): పెద్ద మొత్తంలో చోరీ చేసేందుకు విశ్రాంత ఇంజినీర్‌ను హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను ఏపీలోని మాచవరం పోలీసులు అరెస్ట్ చేశారు. మిస్టరీగా మారిన ఈ కేసును పోలీసులు ఛేదించగా, సోమవారం విజయవాడ సెంట్రల్ ఏసీపీ కె.దామోదర్ కేసు వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని మాయాబజార్ ప్రాంతానికి చెందిన పల్లపు మంగ అలియాస్ అనూష(31) ప్రేమ వివాహం చేసుకుంది. ముగ్గురు సంతానం కలిగాక భర్తతో గొడవలై విడిపోయింది. అనంతరం పిల్లలతో కలిసి విజయవాడ, హైదరాబాద్‌లో ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగించింది. హైదరాబాద్‌లో పరిచయమైన రాజాను ప్రేమించి వివాహం చేసుకున్నాక కొంత కాలం సిద్దిపేటలో ఉన్నారు. వ్యసనాలకు అలవాటు పడిన ఆమె కొద్ది రోజులకే అతనితో కూడా విడిపోయింది. గత ఏడాది ఓ యాప్‌లో పరిచయమైన ఉపేందర్‌రెడ్డితో సహజీవనం చేస్తూ గుంటూరు జిల్లా తాడేపల్లి సమీపంలోని నులకపేట వద్ద ఇల్లు తీసుకుని జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో విజయవాడ గుణదలలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన విశ్రాంత ఇంజినీర్ బుద్దలూరి వెంకటరామారావు ఇంట్లో పనిమనిషిగా చేరింది. ఇంట్లో విలువైన వస్తువులు, డబ్బు, బంగారం అధికంగా ఉండటం గమనించి చోరీకి ఉపేందర్‌రెడ్డిని కూడా ఒప్పించింది. ఈ నెల 10న అర్ధరాత్రి వెంకటరామారావు కళ్లల్లో కారంకొట్టి దిండుతో అదిమి హత్య చేశారు. బీరువాలో బంగారం కోసం వెదికినా లభించకపోవడంతో రూ.90 వేల నగదు తీసుకుని ఉడాయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు కాళహస్తి, చెన్నైలో సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఆపై ఇంట్లో సామగ్రి తీసుకునేందుకు సోమవారం నులకపేటకు రాగా అరెస్ట్ చేసి రూ.41 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

వివాహిత ఆత్మహత్య

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదర్శనగర్ కాలనీకి చెందిన మంగతాయారు సిద్ధిపేట జిల్లాలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తోంది. ఆమె భర్త ఏపీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్న మంగతాయారు.. చాలా కాలంగా బదిలీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకెలాంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొని..

యువకుడు మృతి, మరొకరి పరిస్థితి విషమం




సాగర్ మృతదేహం

ఇల్లెందురూరల్: విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని ఇల్లెందులపాడు చెరువు కట్ట సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ముత్యాలగూడెం గ్రామానికి చెందిన వీరబోయిన సాగర్ (23), శేరిపురం గ్రామానికి చెందిన వట్టం కొండల్‌రావు, రాజు బైక్‌పై ఇల్లెందు మండలంలోని ఏడుబావుల జలపాతం వద్దకు వెళ్లారు. సరదాగా గడిపి రాత్రి తిరిగి వస్తుండగా చెరువు కట్ట వద్ద మూలమలుపులో విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్నారు. దీంతో తీవ్రగాయాలై సాగర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కొండల్‌రావుకు కూడా తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. రాజు ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

ఈ నెలలో 38 డిగ్రీల వరకు నమోదు



చుంచుపల్లి: నైరుతి రుతుపవనాల సీజన్‌లోనూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నెల 9 వరకు 34 డిగ్రీలు ఉన్న ఉష్ణోగ్రతలు ఆది, సోమవారాల్లో 38 డిగ్రీల వరకు నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 22, 23 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. పగటిపూట ఉక్కపోతతో ప్రజలు, చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. జూలైలో భారీ వర్షాలు, వరదలతో ముంచెత్తాల్సింది పోయి ఎండలు పెరగటంతో ప్రజలు ఒకింత ఆందోళన చెందుతున్నారు. ప్రజలు వేసవి కాలంలో మాదిరిగానే ఏసీలు, కూలర్లు వాడుతున్నారు. దీంతో గృహ విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. మరో వైపు వాతావరణ మార్పులతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వారం రోజుల క్రితం చెదురుమదురు జల్లులు కురిశాయి. ఆ తర్వాత వర్షాలు మొఖం చాటేశాయి. జూన్‌తో పాటు, జూలైలో కూడా జిల్లా వ్యాప్తంగా లోటు వర్షపాతమే నమోదైంది.

పలు ప్రాంతాల్లో నమోదైన పగటి ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రత
గరిమెళ్లపాడు	38.0
భద్రాచలం	37.7
లక్ష్మీదేవిపల్లి	37.5
సుజాతనగర్	37.2
పాల్వంచ	37.2
పాత కొత్తగూడెం	37.2
మద్దుకూరు	36.9
అశ్వాపురం	35.8
దుమ్ముగూడెం	35.8
అశ్వారావుపేట	35.4

ఏసీలను వినియోగిస్తున్నాం..



మార్చి, ఏప్రిల్‌లో నమోదు కావాల్సిన ఎండలు జూలైలో కొడుతున్నాయి. ఎండ తీవ్రత, ఉక్కపోతతో నాలుగు రోజులుగా సతమతమవుతున్నాం. చేసేదేమీ లేక తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీలను, కూలర్లను వినియోగిస్తున్నాం. – దినేష్ ప్రజాపతి, కొత్తగూడెం

వెలసిన మావోయిస్టు వ్యతిరేక పోస్టర్లు



కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో పిల్లర్లకు అంటించిన వాల్ పోస్టర్లు

కొత్తగూడెంటౌన్/దమ్మపేట/చర్ల/టేకులపల్లి/అశ్వాపురం/భద్రాచలంటౌన్: జిల్లాలోని పలుచోట్ల సోమవారం మావోయిస్టు వ్యతిరేక పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాఫ్రంట్ పేరుతో వాల్ పోస్టర్లు అంటించారు. కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధి రైల్వే స్టేషన్ ఆవరణలో ఎంట్రన్స్ వద్ద, గోడలకు, దమ్మపేట మండలంలోని ఆదివాసీ గ్రామం పూసుకుంటలో పాఠశాల ప్రహరీ, వాటర్ ట్యాంక్, విద్యుత్ స్తంభాలపై పోస్టర్లను అంటించారు. టేకులపల్లి మండలం మొట్లగూడెం, సిద్దారం, నాగారం జోగు గ్రామాల్లో, చర్ల బస్టాండ్ సెంటర్, జూనియర్ కళాశాల రోడ్, పాతచర్ల, గాంధీ సెంటర్, అశ్వాపురం తహసీల్దార్ కార్యాలయం, పీహెచ్‌సీతో పాటు పలు ప్రధాన కూడళ్లలో, మొండికుంట, గొత్తికోయ గ్రామాల్లో, భద్రాచలం పట్టణంలో ఈ వాల్‌పోస్టర్లు వెలిశాయి. కాలం చెల్లిన సిద్ధాంతాలకు స్వస్తి పలికి మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని పోస్టర్లలో పేర్కొన్నారు. మావోయిస్టు అగ్రనాయకులతోపాటు అందరూ మారాలని కోరారు. కాగా జిల్లాలో పలుచోట్ల ఒకేరోజు మావోయిస్టు వ్యతిరేక పోస్టర్లు వెలుగుచూడటం చర్చనీయాంశంగా మారింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం ఖమ్మం ఆస్పత్రిలో మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడేనికి చెందిన కాక వెంకటరమణ(32) మీ సేవా కేంద్రం నిర్వాహకుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 12న కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో ఉన్న బంధువులను చూసేందుకు వచ్చి, ఫుడ్‌కోర్ట్ దగ్గర ఉండగా స్కూటీపై వచ్చిన వ్యక్తి ఢీకొట్టడంతో వెంకటరమణ కాలు విరగడంతో పాటు గుండెలో బ్లడ్ క్లాట్ అయింది. దీంతో స్థానికులు సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కొరకు ఖమ్మం తరలించారు. ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై వెంకటరమణ సోదరుడు కాక కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఒకరు దుర్మరణం



మడకం రామకృష్ణ (ఫైల్)

చర్ల: మండలంలోని సుబ్బంపేట గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ఓ ఇసుక క్వారీకి సంబంధించిన టిప్పర్ లారీ ఓ ప్రాణాన్ని బలిగొంది. గొల్లగూడేనికి చెందిన మడకం రామకృష్ణ (40) ఆదివారం రాత్రి రోడ్డు పక్కనుంచి వెళ్తుండగా ఇసుక క్వారీకి సంబంధించిన టిప్పర్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య అన్నపూర్ణ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. యజమాని మృతితో ఆ గిరిజన కుటుంబం వీధినపడింది.

జ్వరంతో విద్యార్థి మృతి

గుండాల: నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న విద్యార్థి సోమవారం మృతి చెందాడు. మండలంలోని మామకన్ను గ్రామానికి చెందిన కల్తి భాను ప్రకాష్(13) అదే గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. నాలుగురోజులుగా జ్వరం వస్తుండగా, స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్సపొందాడు. అయినా తగ్గలేదు. ఈ క్రమంలోనే కామెర్లు సోకాయి. సోమవారం గుండాల ఆస్పత్రికి 108 ద్వారా తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి తండ్రి రంగయ్య ఐదు నెలల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు.